సాక్షి
కర్నూలు
గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



దీక్ష బూని.. భక్తి చాటి!
ప్రజలు ఐక్యంగా ఉంటూ దేవరగట్టులో ప్రతి ఏటా దసరా బన్ని ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం మలయ్య దీక్ష స్వీకరించి భక్తిభావాన్ని చాటుతున్నారు. IIలో▸



నల్లమలలో ట్రాఫిక్ జామ్
నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే నల్లమల ఘాట్ రోడ్డులో బుధవారం దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు అవస్థలు పడ్డారు. IIలో▸



అలరించిన నృత్య ప్రదర్శనలు
శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై బుధవారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. నంద్యాల నంది కూచిపూడి కళాక్షేత్రం కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శన చేశారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న జీడీపీ నీటి విడుదల



ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న నీరు

గోనెగండ్ల: ఎగువ ప్రాంతాల్లో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గాజులదిన్నె ప్రాజెక్టుకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిని జీడీపీ అధికారులు హంద్రీ నదికి విడుదల చేస్తున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టులో 4.5 టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం ఉంది. బుధవారం 400 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో గత మూడు రోజులు నుంచి నాలుగో గేటు ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 4.2 టీఎంసీల నీరు ఉంది.

రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జి డీఐజీగా విజయలక్ష్మి

కర్నూలు(సెంట్రల్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కర్నూలు ఇన్‌చార్జి డీఐజీగా విజయలక్ష్మిని నియమించారు. ఈమె ప్రస్తుతం అనంతపురం డీఐజీగా పనిచేస్తున్నారు. ఇక్కడ డీఐజీగా పని చేస్తున్న పీజీ కళ్యాణి విశాఖపట్నంకు బదిలీ అయ్యారు. దీంతో ఆమె స్థానంలో అనంతపురం డీఐజీగా పనిచేస్తున్న విజయలక్ష్మికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పోస్టుకు అర్హులైన న్యాయవాదులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన వారై కనీసం పదేళ్లపాటు న్యాయవాద వృత్తిలో అనుభవం కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తును జిల్లా కోర్టు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చసుకొని ఈనెల 26వతేదీలోపు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

అక్టోబర్ నెల పింఛన్లకు నిధులు మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సెప్టెంబర్ నెల ఉమ్మడి జిల్లాలో 4,54,653 పింఛన్లు ఉండగా.. అక్టోబర్ నెలలో 4,53,760 పింఛన్లకు సంబంధించి రూ.196.43 కోట్లు విడుదలయ్యాయి.సెప్టెంబరు నెలతో పోలిస్తే అక్టోబర్ నెలలో 893 పింఛన్లు కోతపడ్డాయి. పింఛన్ల నిధులు ఈ నెల 30న బ్యాంకులకు విడుదలవుతాయి. అదే రోజున వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేయనున్నారు.

ఆత్మకూరు అటవీ డివిజన్ డీడీగా విఘ్నేష్ అపావ్



ఆత్మకూరురూరల్: నాగార్జునసాగర్ – శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యంలోని ఆత్మకూరు అటవీ డివిజన్‌కు నూతన డిప్యూటీ డైరెక్టర్ (ప్రాజెక్ట్ టైగర్)గా ఐఎఫ్ఎస్ అధికారి విఘ్నేష్ అపావ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తమిళనాడులోని కోయంబత్తూరు వాసి అయిన ఈయన అనంతపురం జిల్లా ముఖ్య అటవీ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ డీడీగా పని చేసిన సాయిబాబా తిరుపతి డీఎఫ్ఓగా బదిలీ అయ్యారు.

ప్రత్యేక పరికరాలతో వన్యప్రాణుల సంరక్షణ

మహానంది: గుంటూరు డివిజన్‌లోని నంద్యాల–గుంటూరు రైల్వే మార్గంలో భద్రతా చర్యలు పటిష్టం చేస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. చలమ–దిగువమెట్ట రైల్వే సెక్షన్ వెంట సిబ్బంది, ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు బుధవారం రాత్రి తెలిపారు. వారు మాట్లాడుతూ.. ప్రతి రోజూ ట్రాక్‌ను తనిఖీ చేసేందుకు డే పెట్రోలింగ్‌లో ఇద్దరు ఉంటారన్నారు. రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు ముగ్గురు వర్షాకాలంలో విధుల్లో ఉంటారని చెప్పారు. దిగువమెట్ట నుంచి చలమ వరకు సుమారు 16 కిలోమీటర్ల మేరకు పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు తదితర వన్యప్రాణుల సంరక్షణ కోసం పగలు, రాత్రి గస్తీ సిబ్బంది టాంబురైన్ లాంటి డ్రమ్స్, పటాకులు, ఫ్లాంబీలు, భద్రతా పరికరాలు వాడతారని పేర్కొనప్పారు. రైల్వే సిబ్బంది, ప్రయాణికుల భద్రతతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు.

డీఏనా.. ఆ ఒక్కటీ అడగొద్దు!

- కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒక్క డీఏ కూడా ఇవ్వని వైనం
- రోడ్డెక్కుతున్న ప్రభుత్వ ఉద్యోగులు
- ప్రతి నెలా రూ.10 వేలు నష్టపోతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు
- ఉమ్మడి జిల్లాలో ఉద్యోగుల బకాయిలు రూ.3,000 కోట్లు పైమాటనే!

దసరా.. హిందువులకు అతి పెద్ద పండుగ. ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ సొంత ఊర్లకు వచ్చి కుటుంబ సభ్యులతో పండుగ చేసుకుంటారు. దసరాకైనా కనీసం ఒక్క డీఏ అయినా ఇస్తారా అని ప్రభుత్వ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 'డీఏనా.. ఆ ఒక్కటీ అడగొద్దు' అన్నట్లు వ్యవహరిస్తోంది.



రోడ్డెక్కిన విద్యుత్ ఉద్యోగులు(ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ప్రతి నెలా రూ.10 వేల వరకు నష్టపోతున్నారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 2024 జూన్ నెలలో బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 16 నెలల కాలంలో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు ఎక్కడివక్కడే ఉండిపోయాయి. ఓపిక పట్టాలనే ఉద్దేశంతో కొన్ని నెలల పాటు ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. నెలలు గడుస్తున్నప్పటికీ బకాయిలు చెల్లించడంలో ఉద్యోగుల్లో సహనం నశిస్తోంది. మొదటి విడతలో వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు రెండో విడతలో నిరసనలు మరింత తీవ్రం చేయనున్నారు.

రోడ్డెక్కుతున్న ఉద్యోగులు

కూటమి ప్రభుత్వంపై ఉన్న భ్రమలు ఉద్యోగుల్లో తొలగుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కుతున్నారు. ఇప్పటికే విద్యుత్ ఉద్యోగులు ఉద్యమ శంఖారావం పూరించారు. అలాగే ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన బాట పట్టాయి. పబ్లిక్ సెక్టారు కంపెనీ అయిన ఏపీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు నిరసన గళం వినిపించారు. ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఉద్యమం చేసే యోచనలో ఉన్నారు. మొన్నటి వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాలంటే భయపడే ఉద్యోగులు నేడు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలతో పాటు దాదాపు అన్ని ఉద్యోగ సంఘాలు బహిరంగంగా నిరసన గళం విప్పుతున్నాయి. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్.. చంద్రబాబు భజనలో తరిస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఉమ్మడి జిల్లాలో బకాయిలు రూ.3 వేల కోట్లు

కర్నూలు జిల్లాలో 25,895, నంద్యాల జిల్లాలో 20,282 మంది ఉద్యోగులు ఉన్నారు. పబ్లిక్ సెక్టారుకు చెందిన ఉద్యోగులు ఉమ్మడి జిల్లాలో మరో 10 వేల మంది వరకు ఉన్నారు. 1వ తేదీ వేతనాలు ఇవ్వడం మినహా ఎలాంటి ప్రయోజనం లేదనే అసంతృప్తితో ఉద్యోగులు రగిలిపోతున్నారు. కూటమి ప్రభుత్వంపై ఒక్క ఉద్యోగి కూడా సంతృప్తితో లేదనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఉమ్మడి జిల్లాలో ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు ఆర్థిక శాఖ అధికారుల లెక్కల ప్రకారం దాదాపు రూ.3 వేల కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వంలో ఇవీ కష్టాలు..

- ఏపీజీఎల్ఐ లోన్, ఫైనల్ పేమెంట్లు పూర్తిగా నిలిచిపోయాయి.
- 10 నెలలుగా మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులు ఇవ్వడం లేదు.
- మూడు సరండర్ లీవ్‌లు పెండింగ్‌ల ఉన్నాయి.
- 2024 అక్టోబరు నుంచి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాడ్యుటీ ఇవ్వడం లేదు.
- పది నెలల ఎన్‌క్యాస్‌మెంట్ ఆఫ్ లీవ్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయి.
- డీఏ అరియర్, పీఆర్‌సీ అరియర్స్ పెండింగ్‌లో ఉండిపోయాయి.
- కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు అవుతున్నా ఐఆర్ ఊసే లేదు.
- 12వ పీఆర్‌సీ గురించి ఆలోచించిన దాఖలాలే లేవు.

పెండింగ్ డీఏల వివరాలు ఇలా ఉన్నాయి

(ఇప్పుడు తీసుకుంటున్న డీఏ 33.67 శాతం)

2024 జనవరిలో 3.64 శాతం డీఏ ఇవ్వాల్సి ఉంది (33.67 శాతం నుంచి 37.31 శాతం)
2024 జూలైలో 2.73 శాతం డీఏ ఇవ్వాల్సి ఉంది.(37.31 శాతం నుంచి 40.04 శాతం)
2025 జనవరిలో 1.82 శాతం డీఏ ఇవ్వాల్సి ఉంది.(40.04 శాతం నుంచి 41.86 శాతం)
2025 జూలై 2.73 శాతం డీఏ ఇవ్వాల్సి ఉంది. (41.86 శాతం నుంచి 44.59 శాతం)
ఉద్యోగులకు చెల్లించాల్సిన 4 డీఏల మొత్తం 10.92 శాతం

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

- 2019లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజులకే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు 27 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ఇచ్చారు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమీషన్ ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ తన పని మొదలు పెట్టే సమయానికి ఎన్నికల నోటిఫికేన్ రావడంతో నిలిచిపోయింది. తదనంతరం పీఆర్‌సీ కమీషన్ చైర్మన్ తన పదవికి రాజీనామా చేశారు.

పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అవుతోంది. ఇంతవరకు ఉద్యోగ, ఉపా ధ్యాయ కార్మికుల పెండింగ్ బకాయిలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ఒకే తాటిపైకి వచ్చి ఫెడరేషన్‌గా ఏర్పడ్డాయి. ఇదివరకే జిల్లాస్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. వచ్చే నెల 7వ తేదీన రాష్ట్రస్థాయిలో ఎద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– హృదయరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య

డీఏ ఇవ్వకపోవడం అన్యాయం



విద్యుత్ ఉద్యోగులకు సంబంధించి 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలవుతున్నా ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడం దారుణం. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఒక్కో ఉద్యోగి సగటున రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు నష్టపోతున్నారు. విద్యుత్ ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై మొదటి దశ ఆందోళన కార్యక్రమాలు పూర్తి చేశాం. త్వరలోనే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతాం.

– సతీష్ కుమార్, ఉమ్మడి జిల్లా చైర్మన్, ఏపీ పవర్ ఉద్యోగుల జేఏసీ

కొనసాగుతున్న వర్షాలు



కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు వర్షాలు కురిశాయి. కర్నూలు రూరల్‌లో అత్యధికంగా 38.2 మి.మీ, అత్యల్పంగా మద్దికెరలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తంగా సగటున 8.3 మి.మీ వర్షం కురిసింది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా.. 132.5 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఆగస్టు నుంచి కురుస్తున్న వర్షాలు రైతుల ఆశలను నీరుకారుస్తున్నాయి. తేమ అరకుండా వర్షాలు కురుస్తుండటంతో దాదాపు అన్ని పంటలు దెబ్బతింటున్నాయి. పత్తి, వేరుశనగ తదితర పంటలు పచ్చగా ఉంటున్నా దిగుబడులు లేకుండా పోతున్నాయి. ఉల్లి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. అధిక వర్షాల వల్ల పత్తి కాయలు కుళ్లిపోతున్నాయి. వేరుశనగలో కాయలు లొత్తలు పడుతున్నాయి.

మండలం	వర్షపాతం(మి.మీ)
కర్నూలు రూరల్	38.2
కర్నూలు అర్బన్	33.4
కల్లూరు	17.6
వెల్దుర్తి	13
తుగ్గలి	12.8
పత్తికొండ	11
ఎమ్మిగనూరు	10.8
హొళగుంద	10.6
గోనెగండ్ల	9.8

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

కర్నూలు(సెంట్రల్): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుర్తించిన బ్లాక్ స్పాట్లలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పోలీసులు ప్రతిపాదించిన 84 అప్రోచ్‌రోడ్లను నిర్మించాలని ఆదేశించారు. ఎల్లమ్మ దేవాలయం దగ్గర అప్రోచ్ రోడ్డు పనులు నెలలోపు పూర్తి చేయాలన్నారు. పెద్దపాడు నుంచి హైవే వరకు నిర్మించే ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదలను అక్టోబర్ 10 లోగా ప్రభుత్వానికి పంపాలన్నారు. ఉల్చాలరోడ్డు, గాయత్రీ ఎస్టేట్‌లలో జంక్షన్ పనులను త్వరగా చేపట్టాలన్నారు. కర్నూలు నగరంలో సుందరీకరణ పనులపై ఆరా తీశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలులో మరో 135 సీసీ కెమెరాలు

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.. ఆదోని, మంత్రాలయం, ఆలూరు ప్రాంతాలోని ఆర్‌అండ్‌బీ రోడ్లలో రాత్రిపూట వెలుతురు ఇచ్చే రోడ్ స్టడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కర్నూలులో సీసీ కెమెరాల నిర్వహణను బా ధ్యతను మునిసిపల్ శాఖ తీసుకోవాలని, మరో 135 సీసీ కెమెరాలను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, కర్నూలు మునిసిపల్ కమిషనర్ విశ్వనాథ్, డీటీసీ శాంతకుమారి పాల్గొన్నారు.

మార్కెట్‌కు వచ్చిన ఉల్లి 170 క్వింటాళ్లే!

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి రావడం పూర్తిగా తగ్గిపోయింది. మద్దతు ధర అమలులో ఉన్నన్ని రోజులు మార్కెట్‌కు వెల్లువెత్తిన ఉల్లి ఇప్పుడు పూర్తిగా తగ్గిపోతోంది. మద్దతు ధర ఉన్నప్పుడు వర్షాలు పడుతున్నా కనీసం 8 వేల క్వింటాళ్లు వచ్చింది. బుధవారం కేవలం ఐదుగురు రైతులు 170 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను మాత్రమే మార్కెట్‌కు తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.387, గరిష్ట ధర రూ.1,009 లభించగా.. సగటు ధర రూ.489 మాత్రమే నమోదైంది.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అర్బన్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ తిరుపతి ఆధ్వర్యంలో ఐబీపీఎస్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా డిగ్రీ కలిగి ఉండాలని, సంబంధిత పరీక్షల టీయర్ -1/ప్రిలిమినరీ పరీక్ష రాసి ఉండాలని (ఫలితాల కోసం ఎదురు చూస్తున్న వారు కూడా అర్హులు) చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచిత వసతి సౌకర్యాలతో కూడిన రెసిడెన్షియల్ శిక్షణ ఉంటుందన్నారు. తిరుపతి, విశాఖపట్నంలోని స్టడీ సర్కిల్స్‌లో శిక్షణనిస్తామన్నారు. అక్టోబర్ 10లోగా https://apstdc.apcfss.inలో దరఖాస్తు చేసుకోవాలని, 12వ తేదీన దరఖాస్తుల స్క్రీనింగ్ పూర్తయిన అనంతరం అక్టోబర్ 22వ తేది నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 08518- 295601 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సమ్మెకు సిద్ధమైన పీహెచ్‌సీ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఫలితం లేకపోయిందన్నారు. దీంతో తాము నిరసనకు దిగక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నిరసన ప్రజలపై కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాత్రమేనన్నారు. కరోనా వంటి అత్యవసర పరిస్థితుల్లోనూ తాము ప్రజా సేవకు వెనకడుగు వేయలేదని, అయినప్పటికీ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం మరుగున పడేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 25న సమ్మె కార్యాచరణ ప్రకటించి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు ప్రకటించారు.



జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరితో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యులు



అందాల 'నిధి'

సెల్ఫీలు దిగుతూ.. చీరలతో ఫోజులిస్తూ సినీ హీరోయిన్ నిధి అగర్వాల్ కర్నూలులో సందడి చేశారు. ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి మొట్టమొదటిసారి కర్నూలుకు విచ్చేసిన హీరోయిన్‌ను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. షాపింగ్ మాల్ ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై ఆమె స్టెప్పులు వేయడంతో యువత కేరింతలతో హోరెత్తించారు.

– కర్నూలు(సిటీ)

దొంగతో జతకట్టి పోలీసు చోరీలు

ఏపీఎస్పీ కానిస్టేబుల్ బాగోతం

- తన బైక్‌పైనే తిప్పుతూ తాళం వేసిన ఇళ్ల గుర్తింపు
- చోరీ సొత్తు సొమ్ము చేసుకొని భాగాలు
- మోస్ట్ వాంటెడ్ దొంగ జగదీష్‌పై 25కు పైగా కేసులు
- ఇప్పటికే ఓ కేసులో అరెస్టయిన కానిస్టేబుల్
- బెయిల్‌పై వచ్చి విజయవాడ దొంగతో దోస్తీ



కానిస్టేబుల్ కృపానందంతో పాటు మోస్ట్ వాంటెడ్ దొంగ జగదీష్‌ను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: ఆయనో కానిస్టేబుల్. బాగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఓ దొంగతో దోస్తీ కట్టాడు. తన ద్విచక్ర వాహనంపై దొంగను కూర్చోబెట్టుకొని నగరంలో తిరుగుతుంటాడు. తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు అక్కడ దొంగను రంగంలోకి దించుతాడు. బయట తాను గస్తీ పోలీసుననే ఫోజు ఇస్తాడు. పని పూర్తి కాగానే ఇద్దరూ కలసి లక్ష్మీ టౌన్‌షిప్‌లోని కానిస్టేబుల్ ఇంటికి చేరుకుంటారు. చోరీ సొత్తును విక్రయించగా వచ్చిన డబ్బును పంచుకుంటారు. మోస్ట్ వాంటెడ్ గజదొంగ జగదీష్‌ను కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కానిస్టేబుల్ ఎద్దుల కృపానందం బాగోతం వెలుగులోకి వచ్చింది.

కారు డ్రైవర్ ఫిర్యాదుతో కేసు నమోదు

కల్లూరులోని తెలుగు వీధిలో నివాసముంటున్న కార్ డ్రైవ్ గురుస్వామి ఈ ఏడాది ఫిబ్రవరి 19న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలసి వృత్తి రీత్యా బయటకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన 11 తులాల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. ఈ మేరకు బాధితుడు గురుస్వామి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ విక్రమసింహ, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి క్రైం పార్టీ సిబ్బందితో కలసి దర్యాప్తులో భాగంగా నగర శివారులో విజయవాడకు చెందిన దొంగ జగదీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా కానిస్టేబుల్ దోస్తీ వ్యవహారం వెలుగు చూసింది. జగదీష్‌పై 25కు పైగా చోరీ కేసులు ఉన్నాయి.

ఫోన్ కాల్ డేటా ఆధారంగా వెలుగులోకి..

దర్యాప్తులో భాగంగా ఇటీవల కాలంలో జైలు నుంచి రిలీజైన నిందితుల వివరాలను పోలీసులు సేకరించారు. కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కానిస్టేబుల్ కృపానందం సెల్‌ఫోన్‌కు గజదొంగ జగదీష్ నుంచి తరచూ ఫోన్లు వచ్చినట్లు కాల్ డేటా సేకరించారు. కల్లూరులోని గురుస్వామి ఇంట్లో దొంగతనం జరిగిన రోజు విజయవాడకు చెందిన జగదీష్ కదలికలు ఉన్నట్లు సాంకేతిక ఆధారాలతో గుర్తించి విచారించడంతో వారి మధ్య ఉన్న బంధం బయటపడింది. విధి నిర్వహణలో భాగంగా కృపానందం విజయవాడకు వెళ్లినప్పుడు అక్కడ గార్డు డ్యూటీ విధుల్లో ఉండగా జగదీష్ పరిచయమయ్యాడు. అది కాస్తా స్నేహంగా మారి తరచూ కర్నూలుకు వస్తూ కానిస్టేబుల్ ఇంట్లోనే ఉంటూ ఇద్దరూ కలసి చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెలుగుచూసింది. ఇలా కర్నూలు నగరంలో ఇద్దరూ కలసి పలు ఇళ్లల్లో చోరీలు చేసినట్లు విచారణలో అంగీకరించారు. నిందితుల నుంచి 5 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. 2007లో కృపానందం ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు.

మద్యం మత్తులో యువకులపై దాడి చేసి సస్పెన్షన్

- కర్నూలులోని బళ్లారి చౌరస్తా సమీపంలో మద్యం మత్తులో ఇద్దరు మైనర్ యువకులతో గొడవ పడిన ఘటనలో బెటాలియన్ అధికారులు కృపానందంపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేశారు.
- విచారణ జరుగుతుండగానే ఈ ఏడాది ఆగస్టులో కంబం పోలీసులు కృపానందంను చోరీ కేసులో అరెస్టు చేసి గిద్దలూరు జైలుకు పంపారు.
- బెయిల్‌పై బయటకు వచ్చి జగదీష్‌తో కలసి కర్నూలులో మళ్లీ ఇళ్ల దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో అంగీకరించాడు.
- నేరానికి ఉపయోగించిన కృపానందం పల్సర్ మోటార్‌బైక్‌ను సీజ్ చేసి ఇరువురినీ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ విక్రమసింహ తెలిపారు.
- కేసును సాంకేతికత ఆధారంగా ఛేదించిన ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ షాకీర్, కానిస్టేబుళ్లు ఎల్లా శివుడు, సుబ్బరాయుడులను సీఐ అభినందించారు.

క్లుప్తంగా

నేడు నంద్యాల డయాసిస్ ఎన్నికలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ అధ్యక్ష ఖండం సెక్రటరీ, ఉపాధ్యక్ష ఎన్నికలు ఈనెల 25న గురువారం పట్టణంలోని పెద్దచర్చి ఎదురుగా ఉన్న డయాసిస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నంద్యాల డయాసిస్ పరిధిలోని అన్ని పాస్టరేట్ సంఘాల గురువులు, కౌన్సిల్ మెంబర్లు మొత్తం 320 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. డయాసిస్ సెక్రటరీ ప్యానల్‌లో బైల్ల ప్రభుదాస్, లక్కా సుధాకర్ పోటీలో నిలిచారు. అలాగే ఉపాధ్యక్ష ప్యానల్‌లో రెవరెండ్ మేకల రాజేంద్రబాబు, రెవరెండ్ పులి ఇమ్మానియేలు బరిలో నిలిచారు. గురువారం ఉదయం ఓటు హక్కు కలిగిన గురువులు, కౌన్సిల్ మెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మధ్యాహ్నం నుంచి పోలింగ్ నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ఎన్నికల అధికారి స్టాన్లీ విలీయం పర్యవేక్షణలో చేయనున్నారు. శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని నంద్యాల అధ్యక్ష ఖండం పీఠాధిపతి(బిషప్) దిరైట్ రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావు బుధవారం తెలిపారు.

రీ - అలైన్‌మెంట్ ప్రతిపాదనలు రాలేదు

- ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ విజయ్ కుమార్

ఆత్మకూరురూరల్: జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టిన యూజర్ ఏజెన్సీ నుంచి అటవీ శాఖకు రీ - అలైన్‌మెంట్ ప్రతిపాదనలు రాలేదని ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. జాతీయ రహదారుల భూసేకరణపై జరుగుతున్న జాప్యంపై 'అడ్డంకులను అధిగమించే దారేది' అన్న శీర్షికన బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై నాగార్జున సాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ విజయకుమార్ స్పందించారు. ఎన్‌హెచ్ 340సీ, 167కే నిర్మాణం కోసం అటవీ భూములలో యూజర్ ఏజెన్సీ జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థకు అలైన్‌మెంట్‌లో కొంత మార్పును సూచించామన్నారు. అయితే ఆ సంస్థ ఇంతవరకు రీ - అలైన్ మెంట్ ప్రతిపాదనలను అటవీ శాఖకు సమర్పించలేదన్నారు. వారికి అవసరమైన అటవీ భూమిలో మార్పుల కారణంగా సీఏ భూమి, మ్యుటేషన్ యూజర్ ఏజెన్సీ నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రికార్డులు సమర్పిస్తే రాష్ట్ర అటవీశాఖ పరిధిలోని ప్రతిపాదనలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

ఆటోను ఢీకొన్న తుఫాన్

- 18 మంది కూలీలకు తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా: వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన కూలీలు రోడ్డు ప్రమాదం బారిన పడ్డారు. 10 నిమిషాల్లో ఇంటికి చేరాల్సిన వారు ఆసుపత్రుల పాలయ్యారు. బుధవారం తంగడంచ చెక్‌పోస్టు సమీపంలో ఆటో, తుఫాన్ ఢీకొన్న సంఘటన చోటుచేసుకొంది. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. తాటిపాడు గ్రామానికి చెందిన 20 మంది వ్యవసాయ కూలీలు అదే గ్రామానికి చెందిన రాఘవేంద్రకు చెందిన ఆటోలో ఓ రైతు పొలం నుంచి ఇంటికి బయలుదేరారు. పారుమంచాల చెక్‌పోస్టు మలుపు నుంచి ఆటో రాంగ్ రూట్లో వస్తుండగా తంగడంచ ఖాజాధాబా వద్ద ఎదురుగా వచ్చిన తుఫాన్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న తెలుగు నీలమ్మ, జయమ్మకు కాళ్లు విరిగాయి. జంగమ్మ, మహేశ్వరి, సుశీలమ్మ, కుర్వ శివలక్ష్మమ్మ, కుమ్మరి మంగమ్మ, జిలకాబీ, లావణ్య, రాణెమ్మ, దర్గమ్మ, కర్ణమ్మ, హుసేన్‌బీ, కుమ్మరి సుబ్బమ్మ, ఆటోడ్రైవర్ రాఘవేంద్రతో పాటు మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ మల్లికార్జున సంఘటనా ప్రాంతానికి చేరుకొని క్షతగాత్రులను 108లో నందికొట్కూరు, కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలకు తరలించారు.

దీక్ష బూని.. భక్తి చాటి !




నెరణికిలో పూజలందుకుంటున్న మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

- మల్లయ్య దీక్షను ప్రారంభించిన నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు
- అమావాస్య నుంచి 15 రోజుల పాటు మద్యం, మాంసానికి దూరం
- కటిక నేలపైనే నిద్ర, చెప్పులు తొడుక్కోకుండా కట్టుబాట్ల నిర్వహణ
- కర్రల సమరం కాదు.. 'బన్ని'ఉత్సవం అని పెద్దల ఉద్ఘాటన



బన్ని(కర్రల సమరం)లో పల్లకీ, విగ్రహాలకు రక్షణగా ఉంటూ ముందుకు తీసుకెళ్తున్న నెరణికి తదితర గ్రామస్తులు (ఫైల్)

హొళగుంద: దేవరగట్టులో ప్రతి ఏటా నిర్వహించే దసరా బన్ని ఉత్సవంలో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు ఐక్యతను చాటుకుంటూ వస్తున్నారు. ప్రత్యేక దీక్ష చేపట్టి వేడుకను వైభవంగా జరుపుకుంటున్నారు. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు జరిగే దసరా 'బన్ని'ఉత్సవాలకు సిద్ధమవుతున్నారు. ఈ మూడు గ్రామాలకు చెందిన కొందరు యువకులు గత నాలుగేళ్ల నుంచి మల్లయ్య మాల దీక్షను చేపట్టి భక్తిని చాటుతున్నారు. అయ్యప్ప, శివయ్య మాల దీక్ష వలే కొన్నేళ్ల నుంచి మల్లయ్య మాల ధరిస్తున్నారు. మూడు గ్రామాల్లో మల్లయ్య దీక్ష చేపట్టే భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. కఠోర దీక్షను పాటిస్తూ తమ ఇలవేల్పుపై భక్తిని చాటుకుంటున్నారు. దేవరగట్టు దసరా బన్ని మహోత్సవాల్లో ఈ మూడు గ్రామస్తులదే కీలక భూమిక. అమావాస్య నుంచి దీక్షను మొదలుపెట్టి బన్ని ఉత్సవాలు ముగిసేంత వరకు నిష్టతో ఉంటారు. విగ్రహాలు తిరిగి నెరణికి గ్రామానికి చేరే వరకు కట్టుబాట్లను తూచ తప్పకుండా పాటిస్తారు. ఈ 15 రోజుల పాటు చెప్పులు తొడుక్కోరు. అలాగే దాంపత్య సుఖానికి పూర్తిగా దూరంగా ఉంటారు. ఇక మద్యం జోలికెళ్లరు. మాంసం ముట్టరు. దైవకార్యాన్ని విజయవంతంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో పండుగను జరుపుకుంటారు. ఎంత కక్షలు ఉన్నా బన్ని రోజు అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉందామని పాలబాస తీసుకుంటారు.



నెరణికి గ్రామం ఏరియల్ వ్యూ

మూడు గ్రామాల్లో ఆరోజే దసరా..

ఈ ఏడాది దేశమంతా అక్టోబర్ 2వ తేదీ దసరా వేడుకలు జరుపుకుంటే ఈ మూడు గ్రామంలో 6వ తేదీన చేసుకుంటారు. విజయదశమి నాడు అందరికీ దసరా పండుగా అయితే ఆ మూడు గ్రామస్తులకు మాత్రం బన్ని ఉత్సవాలు ముగిసి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరే రోజు విజయానికి సూచికగా వారు పండుగ చేసుకుంటారు. ఈ కట్టుబాట్లను కులమత భేదాలు లేకుండా అన్ని వర్గాల వారు పాటిస్తూ ఉత్సవంలో భాగస్వాములవుతారు. ఉత్సవాలు ముగిసేంత వరకు ఒకరినొకరు కొట్టుకోరు. ఒకరినొకరు తిట్టుకోరు. వాళ్ల లక్ష్యం ఒక్కటే. మాళ మల్లేశ్వరుల విగ్రహాన్ని విజయవంతంగా నెరణికికి చేర్చడం. మనస్సు నిండా భక్తిని నింపుకుని నిష్టతో, నిబద్ధతతో ఉంటారు. కట్టుబాట్లను పాటిస్తున్నందునే బన్ని (కర్రల సమరం)లో దేవరగట్టు చుట్టుపక్క ఉన్న మిగిలిన గ్రామాలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొన్నా జైత్రయాత్రాన్ని విజయవంతంగా ముగించుకుని విగ్రహాలను నెరణికి గ్రామం చేరుస్తున్నామని మూడు గ్రామస్తుల నమ్మకం. తమ గ్రామాల్లో ఇన్నాళ్లు ఒకరికొకరు ఎలా ఉన్నా ఉత్సవంలో మాత్రం కలిసికట్టుగా ఉండి తమ మధ్య విధించుకున్న కట్టుబాట్లకు కట్టుబడి ఉంటారు.

ఉత్సవం ఇలా..

ఈ నెల 27న శనివారం నెరణికి గ్రామంలో ఉంటున్న మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులను దేవరగట్టుకు తీసుకెళ్లి రాత్రి కంకణధారణ నిర్వహిస్తారు.

- అక్టోబర్ 2వ తేదీ గురువారం విజయదశమి రోజున కల్యాణోత్సవం, బన్ని, జైత్రయాత్ర.
- 3న భవిష్యవాణి (దైవవాణి)
- 4న సాయంత్రం స్వామివారి రథోత్సవం.
- 5న గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, సాయంత్రం దేవదాసీల క్రీడోత్సవం.
- 6న సోమవారం మాళమల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

విగ్రహాల రక్షణే మా లక్ష్యం



వేలాది మంది పాల్గొనే వేడుకల్లో విగ్రహాలను కాపాడుకోవడమే మా మూడు గ్రామాల లక్ష్యం. పలు కట్టుబాట్లతో ఉండంతోనే జైత్రయాత్రలో విగ్రహాలకు దెబ్బలు తగలకుండా రక్షణ కవచగా ఉండి కాపాడుకుంటూ వస్తున్నాం. విగ్రహాలను కైవసం చేసుకోవడానికి అడ్డు పడ్డారనేది అవాస్తవం. మద్యం, మాంసం ముడితే బన్ని ఉత్సవం జరిపే అర్హత కోల్పోతాం. ఉత్సవంలో మా మూడు గ్రామాల ఆచారాలు, పూజలు నిష్ట నిబద్ధత కలిగి ఉంటాయి.

– బసవరాజు, రాక్షస గుండ్లకు రక్తం ఇచ్చే గొరవయ్య, కంచాభీరా వంశస్తుడు, నెరణికి

నిష్టతో కట్టుబాట్లను పాటిస్తారు



దేవరగట్టు ఉత్సవాల్లో మూడు గ్రామస్తులు నిష్టతో కట్టుబాట్లు పాటిస్తారు. ఇక బన్ని రోజు రెండుసార్లు స్నానం చేస్తారు. సాయంత్రం గట్టుకెళ్లే ముందు ప్రతి ఒక్కరు స్నానమాచారిచి గ్రామంలోని గుడిలకు వెళ్లి టెంకాయలు సమర్పిస్తారు. అనంతరం తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని కొండకు బయలుదేరుతారు. బన్నిలో ఏ ఒక్కరు మద్యం తాగరు, మాంసం ముట్టరు. తాగి కర్రలతో విగ్రహాల దగ్గరకు వచ్చే వారిని కట్టడి చేసి విగ్రహాలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా జైత్రయాత్రలో పాల్గొంటారు.

– రవిశాస్త్రీ, మాళమల్లేశ్వరునికి కల్యాణం జరిపే పురోహితుడు, నెరణికి

కర్రలతో కొట్టుకోరు..



దేవరగట్టు బన్ని ఉత్సవంలో భక్తులు కర్రలతో కొట్టుకుంటారనేది అవాస్తవం. ఉత్సవాన్ని కర్రల సమరంగా చెప్పడం భావ్యం కాదు. పూర్వం గట్టు మీదకెక్కడానికి దివిటీలు, జంతువుల నుంచి రక్షణగా కర్రలు, ఆయుధాలు తీసుకెళ్లేవారు. కాలక్రమేణా అవి దురుద్దేశాలకు వాడడంతో కర్రల సమరంగా ముద్ర పడింది. మద్యం సేవించిన వారు మాత్రమే గాయ పడుతారు తప్ప ఇతరులకు గాయాలు కావు. విచక్షణ కోల్పోయి కొట్టుకోవడం వల్ల గతంలో చనిపోయారు. ఇప్పుడు తగ్గిపోయాయి. ఇదొక సంప్రదాయ పండుగ.

– గిరిస్వామి,భవిష్యవాణి వినిపించే ఆలయ పూజారి

దీక్ష వల్లే విగ్రహాల రక్షణ



మూడు గ్రామస్తులు దీక్ష కారణంగా 15 రోజులు మద్యం సేవించరు.దీని వల్ల విగ్రహాల చుట్టూ ఉన్న వారు అన్ని వేళలో జాగ్రత్తగ ఉంటారు. చురుకుగా వ్యవహరిస్తారు. దీంతో విగ్రహాల దగ్గరకు వచ్చిన వారి నుంచి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవుళ్లను ముందుకు తీసుకెళ్తారు. దీక్షలో ఉండడం వల్ల తెలియని శక్తి మాలో ప్రవేశిస్తోంది. బన్ని ఉత్సవాన్ని విజయవంతంగా పూర్తి చేస్తాం. – రవిస్వామి, గొరవయ్య, నెరణికి

వస్త్రాలయ షాపింగ్ మాల్ ప్రారంభం



షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరోయిన్ నిధి అగర్వాల్, చిత్రంలో షాపింగ్ మాల్ ఎండీ గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ తదితరులు

కర్నూలు (టౌన్): నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో బుధవారం వస్త్రాలయ షాపింగ్ మాల్ ప్రారంభమైంది. కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, సినీ హీరోయిన్ నిధి అగర్వాల్, షాపింగ్ మాల్ ఎండీ గోపాల్ రెడ్డి, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు. అతిథులు నూతన షాపింగ్ మాల్‌ను రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తమ వస్త్రాలయ షాపింగ్ మాల్‌లో అపరితమైన కలెక్షన్లు, మెన్స్‌వేర్, ఉమెన్స్ వేర్, కిడ్స్ వేర్, పార్టీ వేర్, 1 గ్రామ్ గోల్డ్ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. షాపింగ్ మాల్ ప్రారంభం పురస్కరించుకొని దీపావళి పండుగ వరకు లక్కీ డ్రాలు ఉన్నాయన్నారు. రూ.1000 కొనుగోలు చేస్తే లక్కీ డ్రాలో టీవీ, ఫ్రిడ్జ్, బైక్ వంటి బహుమతులతో పాటు బంపర్ డ్రాలో విజేతకు కారును కూడా అందిస్తున్నామన్నారు.

నల్లమలలో ట్రాఫిక్ జామ్

మహానంది: నల్లమల ఘాట్‌రోడ్డులో బుధవారం దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు అవస్థలు పడ్డారు. మహారాష్ట్రకు చెందిన సంఘ్వి మూవర్స్‌కు చెందిన భారీ వాహనం గిద్దలూరు మీదుగా నంద్యాల వైపు వస్తుండగా చింతమాను టర్నింగ్ వద్ద సాంకేతిక లోపం తలెత్తడంతో ఆగిపోయింది. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. అనంతరం వాహనదారుల సహాయంతో రోడ్డుకు అడ్డుగా ఉన్న భారీ వాహనాన్ని పక్కకు తప్పించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ప్రతి విద్యా సంస్థలో ఈగల్ బృందాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఎస్పీ పి.విక్రాంత్‌పాటిల్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): యూనివర్సిటీ మొదలు పాఠశాలల వరకు ప్రతి విద్యా సంస్థలో ఈగల్‌టీం(బృందాలు)లను సోమవారంలోపు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. జూనియర్ కాలేజీలు, పాఠశాలల ఈగల్ టీంలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు ఉండేలా చూసుకోవాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎన్‌సీఓఆర్‌డీ సమావేశాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు, విద్యార్థుల సాయంతో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాపై పూర్తి స్థాయిలో నిఘా వేయవచ్చన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో అనారోగ్యం బారిన పడతారని, కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడతాయనే విషయాన్ని ఈగల్ టీంల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. పంట పొలాల్లో గంజాయి పెంచకుండా తగిన నిఘా ఉంచాలని వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీసు శాఖ మత్తు పదార్థాల వినియోగం, రవాణాను అరికట్టడంపై ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలు, వీడియోలను ఆవిష్కరించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలోని 250 పాఠశాలల్లో ఈగల్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి శుక్రవారం పాఠశాలల్లో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యా సంస్థలకు సూచించినట్లు చెప్పారు. ఆదోని మండలం పెద్దతుంబళంలో గంజాయిని అంతర పంటగా సాగు చేస్తుండడంతో గుర్తించామని, సుమారు 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేడీ్ప సీఈఓ నాసర రెడ్డి, కర్నూలు మునిసిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సబీహాపర్వీన్, డీటీసీ శాంత కుమారి, ఆర్టీసీ ఏఓ సుధారాణి, డిజేబుల్డ్ ఏడీ ఫాతిమా సుల్తానా, జేడీఏ వరలక్ష్మీ, డీఎంహెచ్ఓ శాంతికళ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన, ఆర్ఐఓ లాలెప్ప, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, లేబర్ డీసీ వెంకటేశ్వర్లు, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ అభీరాబాను పాల్గొన్నారు.


సీడీపీఓ వేధింపులపై విచారణ



ఆలూరు ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ చేస్తున్న పీడీ విజయ

ఆలూరు రూరల్: ఆలూరు సీడీపీఓ నరసమ్మ వేధిస్తున్నారని కురువళ్లి అంగన్‌వాడీ టీచర్ భువనేశ్వరి ఆరోపణలపై జిల్లా ఐసీడీఎస్ పీడీ విజయ విచారణ చేపట్టారు. ఈ నెల 6వ తేదీన సీడీపీఓ కురువళ్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌లో వివరాలు లేకపోవడంతో టీచర్‌ను నిలదీసి, రూ. 4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, ఇవ్వలేకపోవడంతో వేధిస్తు న్నారని అంగన్‌వాడీ టీచర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పీడీ విజయ బుధవారం ఆలూరుకు చేరుకుని సీడీపీఓ, సూపర్ వైజర్, అంగన్‌వాడీ టీచర్, ఆయాను విచారించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.

సబ్ జైలు తనిఖీ



వంట గదిలో సరుకులను తనిఖీ చేస్తున్న జడ్జి

డోన్ టౌన్: పట్టణంలోని సబ్ జైలును బుధవారం జిల్లా లీగల్ సర్వీసు అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలను, వంట గదిని పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. ఏ ఏ నేరాలపై జైలుకు వచ్చారు? బెయిలు కోసం దరఖాస్తు చేసుకున్నారా? ఎవ్వరైన 70 ఏళ్ల పైబడిన వయస్సు వారు ఉన్నారా? అంటూ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జైలులో వసతులు, భోజనం, వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగారు. బెయిలు కోసం స్వతహాగా దరఖాస్తు చేసుకోవడానికి ఆర్థిక స్థోమత లేక పోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు పెట్టకోవాలని సూచించారు. ఈయన వెంట పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, లీగల్ అడ్వయిజర్ మాధవస్వామి తదితరులు ఉన్నారు.

వివాదం రాజేసిన చేపల వేట

- ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత



మెట్టుపల్లె కాల్వ వద్ద గుమికూడిన జనాన్ని పంపుతున్న పోలీసులు



ఆటోలో ఉన్న చేపలు

అవుకు(కొలిమిగుండ్ల): చేపల వేట కోసం రెండు వర్గాల మధ్య వివాదం రాజుకుంది. బుధవారం మెట్టుపల్లె వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. అవుకు మండలం మెట్టుపల్లె సమీపంలోని గాలేరు నగరి కాల్వకు ఎగువ నుంచి నీటి విడుదల సామర్థ్యాన్ని ఇటీవల అధికారులు తగ్గించారు. దీంతో మెట్టుపల్లె, కోనాపురం గ్రామాలకు చెందిన కొంత మంది వ్యక్తులు గాలేరు నగరి కాల్వలో దిగి చేపలు పట్టుకుంటున్నారు. పది నుంచి ఇరవై కేజీల బరువున్న చేపలు కాల్వ ద్వారా అవుకు రిజర్వాయర్‌లోకి చేరుతుంటాయి. కొద్ది రోజుల నుంచి రెండు గ్రామాలకు చెందిన వ్యక్తులు చేపలు పట్టుకొని బనగానపల్లెకు చెందిన వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు నాలుగు టన్నుల వరకు చేపలను విక్రయించినట్లు తెలుస్తోంది. తాజాగా బుధవారం టన్నుకు పైగానే చేపలు పట్టుకొని ఆటోలో తరలించేందుకు సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న అవుకు పట్టణానికి చెందిన బెస్త సంఘం నాయకులు గాలేరు నగరి కాల్వ వద్దకు చేరుకున్నారు. చేపలు పట్టుకునే హక్కు తమకు మాత్రమే ఉందని వాదించారు. అయితే తమ గ్రామ పొలిమేర కాబట్టి తమకు మాత్రమే హక్కు ఉందని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకోవడంతో ఒకరికొకరు స్వల్పంగా తోపులాటకు దిగడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు కాల్వ వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇరువర్గాల వాదనలు విని సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎవరూ చేపలు పట్టరాదని సూచించారు. ఆటోలో ఉన్న చేపలను స్టేషన్‌కు తరలించారు. సీఐ మంజునాథరెడ్డి అవుకు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని రెండు గ్రామాలకు చెందిన వ్యక్తులతో పాటు అవుకు బెస్త సంఘం నాయకులతో చర్చించారు. కాగా చివరకు ఆ ప్రాంతం చేపల వేటకు నిషేధమని, ఎవరూ చేపలు పట్టకూడదని తేల్చి చెప్పారు.ఆటోలో ఉన్న చేపలను అప్పటికే కొనుగోలు చేసిన వ్యాపారులకు అప్పగించారు.

విజయవాడకు బయలుదేరిన కొత్త సారోళ్లు

- ఉమ్మడి జిల్లా నుంచి 123 బస్సుల్లో తరలింపు
- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్



నూతన ఉపాధ్యాయుల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ సిరి, చిత్రంలో డీఈఓ శామ్యూల్ పాల్ తదితరులు

కర్నూలు సిటీ: డీఎస్సీ–2025లో ఉపాధ్యాయ పోస్టులు సాధించిన అభ్యర్థులు నియామక పత్రాలు అందుకునేందుకు బుధవారం విజయవాడకు తరలివెళ్లారు. వీరంతా గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అమరావతిలో నియామకపత్రాలు అందుకోనున్నారు. ఉమ్మడి జిల్లా అభ్యర్థులు, వారికి ఒకరి చొప్పున సహాయకులను రాయలసీమ యూనివర్సిటీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో జిల్లా విద్యాశాఖ అధికారులు తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత కార్యక్రమానికి ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్న 2,805 మంది నూతన ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించామన్నారు. 123 బస్సుల్లో ప్రతి బస్సుకు ఒక పోలీసు ఎస్కార్ట్, మెడికల్ కిట్లు ఏర్పాటు చేశామన్నారు. పర్యవేక్షణకు పది బస్సులకు ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. రాత్రి విడిది కోసం ప్రత్యేకంగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా నరసరావుపేట, గుంటూరులో బస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమం ముగిసిన తరువాత అదే బస్సుల్లోనే అభ్యర్థులను జిల్లా కేంద్రానికి తీసుకొస్తామన్నారు. కాగా చంటి పిల్లలు ఉన్న తల్లులు ఎంతో అవస్థలు పడ్డారు. వాతావరణం చల్లగా ఉండడంతో పిల్లలతో సుదూర ప్రయాణం చేయాల్సి రావడంతో ఆందోళన చెందారు. అయితే నియామక పత్రాలు జిల్లాకు ఇద్దరికి మాత్రమే వేదికపై ఇస్తారని ప్రయాణంలో తెలియడంతో అభ్యర్థులు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ప్రచారం కోసం ప్రభుత్వం తమను ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సబబు అని బస్సుల్లో ఉన్న అధికారులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

పంట తడిచి.. నష్టం మొలకెత్తి!

దొర్నిపాడు: భారీ వర్షాలు అన్నదాతను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్నను విస్తారంగా సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలు పంటను దెబ్బతీశాయి. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. కానీ గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కంకులు చెట్లపైనే మొలకెత్తున్నాయి. కోతకోయడానికి పొలమంతా నీరు, బురద ఉండటంతో కోత యంత్రాలు, కూలీలు పొలంలోకి వెళ్లలేని పరిస్థితి.

ఇంకా వర్షాలు కురుస్తూనే ఉండటంతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన మొక్కజొన్న కళ్ల ముందే పొలంలోనే వర్షాలకు తడిచి కంకులు మొలకెత్తుండటంతో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.



క్రిష్టిపాడులో సాగుచేసిన మొక్కజొన్న పంట (ఇన్‌సెట్) కంకిలో మొలకలు వచ్చిన దృశ్యం